ఈరోజు (28) సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలను ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. – సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయం తరపున

## ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ప్రధాని
## - బిజెపియేతర రాష్ట్రాలపై మోడీ వ్యాఖ్యలు అర్థరహితం
## - ముఖ్యమంత్రి మౌనం వీడాలి
## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

దేశంలో పెట్రోలు ధరల పెంపు విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. పోదిలిలోని ఎన్‌జిఓ హోంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రధాని వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్‌పై అధిక పన్నులు విధిస్తుంటే..వాటిని తగ్గించాలని లేదా ప్రధాని వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. ప్రధాని వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించాలని, లేకుంటే రాష్ట్ర ప్రజలను అవమానించినట్లేనని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎపిలోనే పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్న మాట వాస్తమన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై రూ.5 నుండి రూ.10 వరకు తగ్గిస్తున్నట్లు కేంద్రం చెబుతున్న మాట అవాస్తవమన్నారు. కేంద్రం అసలు పన్ను, కొసరు పన్ను, సెస్‌లు కలిపి రూ.34, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.28 పన్ను వసూలు చేస్తోందన్నారు. రూ.59 ఉన్న పెట్రోల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు అధికంగా వేయడంతో ప్రస్తుతం లీటరు రూ.121కి చేరిందని తెలిపారు. కేంద్రం సెస్‌ను తొలగిస్తే దేశ ప్రజలకు రూ.90కే లీటరు పెట్రోల్ ఇవ్వొచ్చన్నారు. కేరళ విషయం ప్రస్తావించిన ప్రధాని ఉత్తరాది రాష్ట్రాల్లో, ఏపిలో లీటరు పెట్రోలు రూ.121, కేరళలో రూ.117 ఉందన్నారు. బిజెపిపాలిత మధ్యప్రదేశ్‌లో రూ.118 ఉందన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం రాగానే మొదటిసారి దేశానికి మార్గదర్శకంగా డీజిల్‌పై రూ.12.33, పెట్రోల్‌పై రూ.6.57 తగ్గించిందన్నారు. దీని వల్ల కేరళ ప్రభుత్వం ప్రతి ఏడాదీ రూ.1500 కోట్ల ఆదాయం కోల్పోతున్నా ప్రజాశ్రేయస్సు కోసం భరిస్తోందన్నారు. తరువాత కాలంలోనే తమిళనాడు వంటి రాష్ట్రాలు పెట్రోల్ ధరలు తగ్గించినట్లు తెలిపారు. ఆ సమయంలో కేంద్రం స్పందించలేదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై రేట్లు తగ్గించి దేశానికే ఆదర్శంగా నిలిచిన కేరళ గురించి ప్రధాని మాట్లాడకుండా, విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

### ప్రత్యేక యంత్రాంగంతో మహిళలకు రక్షణ కల్పించాలి

విజయవాడలో ఇటీవల ప్రభుత్వ వైద్యశాల సిబ్బందే మహిళపై అత్యాచారం చేసిన ఘటన మరువక ముందే గుంటూరు జిల్లా తుమ్మపూడిలో వివాహితను దుండగులు అత్యాచారం చేసి చంపేశారన్నారు. ఇటువంటి ఘటనలతో ప్రభుత్వం ప్రజలకు ఏమి సందేశం ఇస్తుందో చెప్పాలన్నారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరగడం వారికి రక్షణ లేదనే విషయాన్ని స్పష్టం చేస్తోందని తెలిపారు. మరోవైపు దిశా చట్టంతో నిందితులపై 21 రోజుల్లో చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెబుతున్నారన్నారు. దిశ చట్టం అమలు కావడంలేదని, ముఖ్యమంత్రి మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.దారుణాలకు పాల్పడుతున్నవారిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని, పోలీసుశాఖ ఏం చేస్తుందో సమాధానం చెప్పాలని కోరారు. ఘటనపై గుంటూరు ఎస్‌పి ప్రకటన అమానుషంగా ఉందన్నారు. హత్యకు గురైన మహిళలకు అక్రమ సంబంధం అంటగట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.ఘటనను పక్కదారి పట్టించడం మహిళల భవిష్యత్తుకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఎస్‌పి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.25లక్షలు ఆర్థికసాయం, పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ పాల్గొన్నారు.

= = = =